సాక్షి
జోగులాంబ గద్వాల

మంగళవారం । 12 । సెప్టెంబర్ । 2023



అటవీ సంరక్షణకు కృషి

అటవీ సంరక్షణకు పాటుపడాలని డీఎఫ్‌ఓ రోహిత్ గోపిడి అన్నారు.

వివరాలు 8లో ▸



సుజల దృశ్యాన్ని చూస్తాం

పాలమూరు ప్రాజెక్ట్‌తో సుజల దృశ్యం చూస్తామని మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 33.1 /23.2

ఆకాశం కొంత మేర మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం, రాత్రి సమయంలో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అంగరంగ వైభవంగా..



గద్వాల: నడిగడ్డ ఇలవేల్పు జమ్ములమ్మ కల్యాణ మహోత్సవం ప్రారంభమైంది. మూడు రోజుల ఉత్సవాలలో భాగంగా సోమవారం సాయంత్రం చేపట్టిన ఎదుర్కోళ్ల ఉత్సవం అత్యంత వైభంగా సాగింది. జమ్ములమ్మ కల్యాణోత్సవం ప్రారంభానికి ముందు ఆలయంలో అర్చకులు, వేద పండితులు గణపతి పూజతో ఉత్సవాలను ప్రారంభించారు. జమ్మిచేడు శివాలయం నుంచి ఎదుర్కోళ్లను ప్రారంభించి కళాకారులతో గంగ తెప్ప, పుట్ట బంగారాన్ని అర్చకులు, ధర్మకర్తలు ఆలయానికి తీసుకొచ్చారు. డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఎదుర్కోళ్లను నిర్వహించారు. పోతురాజుల నృత్యాలు, విన్యాసాలతో సందడి నెలకొంది. ఆలయ అధికారి పురేందర్, పలువురు అధికారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు కల్యాణం.. భారీ ఏర్పాట్లు

మంగళవారం ఉదయం 11.16 గంటలకు జమ్ములమ్మ కల్యాణం జరగనుంది. ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి దంపతులు అమ్మవారికి ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు తీసుకురానున్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ సరితతో పాటు జిల్లాలోని ముఖ్యమైన నాయకులు, ప్రముఖులు హాజరుకానున్నారు. ఈమేరకు ఆలయ నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేశారు. ఆలయం ఎదుట ప్రత్యేకంగా కల్యాణ వేదికను సుందరంగా తీర్చిదిద్దారు. పెద్ద సంఖ్యలో ప్రజలు కూర్చొని పెళ్లి వేడుక తిలకించేందుకు వీలు కల్పించారు. అమ్మవారిని దర్శించుకునే భక్తులు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేశారు.

ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డికి ఊరట

- హైకోర్టు అనర్హత తీర్పుపై సుప్రీంకోర్టు స్టే

గద్వాల రూరల్: ఎన్నికల అఫిడవిట్‌లో సరైన వివరాలు పొందుపర్చలేదని పేర్కొంటూ మాజీ మంత్రి డీకే అరుణ హైకోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిపై అనర్హత వేటు వేసిన విషయం పాఠకులకు విదితమే. ఈ నేపథ్యంలో కృష్ణమోహన్‌రెడ్డి హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సోమవారం సుప్రీంకోర్టు హైకోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే ఇవ్వడంతో బండ్ల కృష్ణమోహన్‌రెడ్డికి ఊరట లభించింది. దీంతో సోమవారం గద్వాలలో ఆయన అభిమానులు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. న్యాయమే గెలిచిందని మున్సిపల్ చైర్మన్ కేశవ్ అభిప్రాయపడ్డారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు మిఠాయిలు పంచుకు తిన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి జ్యోతి, కుమారుడు సాయిసాకేత్‌రెడ్డి, జంబురామన్‌గౌడ్, సుభాన్, నాగర్‌దొడ్డి వెంకట్రాములు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పర్సంటేజీల గోల..!

'దళితబంధు పథకం తొలివిడత అర్హుల ఎంపికలో కొందరు ప్రజాప్రతినిధులు పర్సంటేజీలు తీసుకున్నారని.. దళితుల అభ్యున్నతి కోసం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ పథకం ప్రవేశపెట్టామని.. ఇక మీదట ఇలాగే కొనసాగితే సహించేది లేదు..' అంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ పార్టీ నేతలను తీవ్రస్థాయిలో హెచ్చరించారు. అయినా కూడా కొందరు అధికార పార్టీ జిల్లా నాయకుల తీరు వల్ల దళితబంధు పథకం గద్వాలలో అభాసుపాలవుతుంది. రూ.10లక్షల యూనిట్‌కు ఇంత పర్సంటేజీ అంటూ ఓ నాయకుడు యథేచ్ఛగా భేరానికి తెరలేపడం.. ఇందుకు సంబంధించి ఆడియో రికార్డు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో జిల్లా అంతటా చర్చనీయాంశమైంది.



'దళితబంధు' అర్హుల ఎంపికలో నాయకుల భేరసారాలు

- రూ.3 లక్షలు ఇస్తేనే ఎంపిక చేస్తామంటూ ఓ ప్రజాప్రతినిధి భేరం
- సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ఫోన్‌కాల్ రికార్డ్
- పేరు మోసిన నేతలే మధ్యదళారులుగా అవతారం
- అలంపూర్‌లోనూ ఇదే తరహాలో ఆరోపణలు

గద్వాల రూరల్: దళితుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రవేశపెట్టిన దళితబంధు పథకాన్ని అడ్డుపెట్టుకొని జిల్లాలోని కొందరు నాయకులు పర్సంటేజీలు.. భేరసారాలు షురూ చేశారు. రెండో విడత కింద చేపట్టిన దళితబంధు పథకంలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల నుంచి రూ.3లక్షలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఇటీవల గుప్పుమంటున్నాయి. ఇందుకనుగుణంగానే అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి ఫోన్ చేసి మరీ లంచమడిగి బెదిరింపులకు దిగిన కాల్ రికార్డ్ సోషల్‌మీడియాలో వైరల్ కావడంతో అధికారపార్టీ నేతల తీరుపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వారు సూచించిన వారికే పథకాలు

ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమాభివృద్ధి పథకాలకు కొన్ని నిర్దిష్టమైన మార్గదర్శకాలు జారీ చేయడం, అందుకు అనుగుణంగా అర్హులను గుర్తించి వారికి మాత్రమే పథకాల ఫలాలు దక్కేలా చూడడం అధికారులు, ప్రజాప్రతినిధుల ముఖ్య ఉద్దేశ్యం. ముఖ్యంగా ఎలాంటి సిఫారసు, మధ్య దళారీలు లేకుండా నిక్కచ్చిగా అమలు చేయాలని స్పష్టమైన నిబంధనలున్నాయి. కానీ జిల్లాలో మాత్రం అవేమి పనిచేయడం లేదు. కేవలం పలుకుబడి ఉన్న నాయకుల సిఫారసు మేరకే సంక్షేమాభివృద్ధి పథకాల పంపిణీ ప్రక్రియ సాగుతోంది. ఇక్కడ గ్రామ స్థాయి నేత మొదలుకుని నియోజకవర్గ స్థాయి నేత వరకు తనకు నచ్చిన వారికే సంక్షేమాభివృద్ధి పథకాలలో పెద్దపీట వేస్తున్నారు. తొలివిడత దళితబంధు పంపిణీలో నేతల సిఫారసును పక్కన పెట్టి అర్హులకు దళితబంధు ఇవ్వాలంటూ గద్వాల మండలం, ఇటిక్యాల మండలాలకు చెందిన దళితులు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారంటే నేతల ప్రమేయం ఏస్థాయిలో ఉందో అర్థమవుతోంది. ఈవ్యవహారాలకు అడ్డుకట్ట వేసి అర్హులకు పథకాల ఫలాలు దక్కేలా చూడాల్సిన అధికారులు సైతం చేతులు ముడుచుకుని చూస్తుండిపోతున్నారు తప్పితే కట్టడి చేయలేకపోతున్నారంటే జిల్లాలో అధికార పార్టీలో పలుకుబడి గల నాయకుల 'పవర్'ను తెలియజేస్తుంది.

జిల్లా అంతటా ఇదే తంతు..

ఇది ఒక్క గద్వాల మండలమే కాదు మిగిలిన ధరూరు, మల్దకల్, గట్టు, కె.టి.దొడ్డి మండలాల్లో కూడా ఇదే తరహాలో వసూళ్ల పర్వం సాగిస్తున్నట్లు జోరుగా ప్రచారం ఉంది. అలంపూర్‌లోనూ ఇదే తరహాలో విమర్శలు వెల్లువెత్తున్నాయి. తొలివిడతలో ఒక్కో లబ్ధిదారుడి నుంచి రూ.2లక్షల నుంచి రూ.3లక్షల వరకు వసూలు చేయగా ఈసారి ఏకంగా రూ.3లక్షలకుపైనే పర్సంటేజీల కింద వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. అలంపూర్‌లో తొలివిడత దళితబంధులో చోటుచేసుకున్న వసూళ్ల పర్వంపై ఏకంగా సీఎం కేసీఆర్‌కు సైతం ఫిర్యాదు వెళ్లినట్లు సమాచారం. గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం కేటాయించిన ట్రాక్టర్ల కొనుగోలు ప్రక్రియలో సైతం కొందరు పలుకుబడి గల నాయకులు పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడినట్లు అప్పట్లో ఆరోపణలు వెల్లువెత్తాయి.

ఫిర్యాదు చేస్తే చర్యలు

దళితబంధుకు సంబంధించి గద్వాల నియోజకవర్గం నుంచి ఇప్పటి వరకు 600 దరఖాస్తులు వచ్చాయి. అలంపూర్ నియోజకవర్గానికి సంబంధించి ఇంకా దరఖాస్తులు రాలేదు. ఇందులో ఎమ్మెల్యే ద్వారా వచ్చిన దరఖాస్తులనే తీసుకుంటున్నాం. పూర్తిగా పరిశీలించి అర్హులను ఎంపిక చేస్తాం. ఎవరైన మధ్యదళారులు పర్సంటేజీల కోసం ఒత్తిడి తెస్తే నేరుగా ఫిర్యాదు చేయండి. తప్పకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం

– రమేష్‌బాబు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ

రూ.3 లక్షలు ఇస్తేనే 'దళితబంధు'

గద్వాల మండలంలోని పెద్ద గ్రామ పంచాయతీకి చెందిన అధికార పార్టీ ప్రజాప్రతినిధి తన కోటా కింద ఐదుగురికి దళితబంధు ఇచ్చేలా ముఖ్యనేత హామీ ఇచ్చారు. ఐదుగురిలో తనకు కావాల్సిన వారికి అది కూడా రూ.3లక్షలు ఇచ్చిన వారికే ఇస్తానని వేలం పాట పెట్టారు. దీనిపై అదే గ్రామానికి చెందిన లబ్ధిదారు ఇదేందని, అంత డబ్బు తమ వల్ల కాదని.. కొంత తగ్గించమని బ్రతిమిలాడాడు. అయినా లెక్కచేయకుండా రూ.3లక్షలు ఇస్తేనే రూ.10లక్షల దళితబంధు ఇస్తామని, దరఖాస్తు చేసుకున్నంత మాత్రాన నీకు దళితబంధు వస్తదనుకుంటే పొరపాటు అని ఫోన్ కాల్ సంభాషణలో ఉంది. ఈ కాల్ రికార్డు సోషల్ మీడియాలో వైరల్ కావడం ఇప్పుడు గద్వాలలో పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది. సదరు లంచావతార నేతలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

గద్వాల: క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని ముందుకు సాగాలని డీవైఎస్‌ఓ బీఎస్ ఆనంద్ అన్నారు. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి తైక్వాండో పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి క్రీడాకారుడికి క్రీడా స్ఫూర్తి ముఖ్యమని, దీని వల్లే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని అభిప్రాయపడ్డారు. క్రీడల అభ్యున్నతికి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందన్నారు. జిల్లా పేరును రాష్ట్రం, జాతీయస్థాయిలో నిలిపేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి క్రీడాకారుడు జాతీయస్థాయి పోటీలను లక్ష్యంగా నిర్దేశించుకొని ఆడాలని సూచించారు. ప్రతిభను వెలికి తీయడానికి పోటీలు దోహదం చేస్తాయని చెప్పారు. అనంతరం ప్రతిభ చాటిన క్రీడాకారులకు మెడల్స్, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి జితేందర్, కరాటే మాస్టర్ శ్రీహరి, శ్రీనివాస్, రంగస్వామి, మల్లికార్జున్, రాజేశ్వరి, మౌనిక, రామంజనేయులు, రషీద్, రాజుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా బోగస్ ఓట్ల తొలగింపు



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

- ఓటరు జాబితాలో డబుల్ ఓటర్లు ఉండొద్దు
- కలెక్టర్ వల్లూరు క్రాంతి

గద్వాల రూరల్: ఓటరు జాబితాలో డబుల్ ఓటర్లు, మరణించిన వారి తొలగింపు ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆమె ఐడీవోసీ కార్యాలయంలోని సమావేశం హాలులో తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్ల వారీగా డబుల్ ఓటర్లను క్షుణ్ణంగా తనిఖీ చేసి ఫామ్ 1,2,3 ప్రకారం తొలగించాలన్నారు. తొలగించిన వారి వివరాలను సమగ్రంగా సేకరించాలని, అలాగే మరణించిన వారైతే డెత్‌సర్టిఫికెట్ ఆధారంగా తొలగింపు ప్రక్రియ చేపట్టాలన్నారు.

ధరణి ఫిర్యాదులు పెండింగ్‌లో ఉంచొద్దు

అదేవిధంగా ధరణికి సంబంధించి వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పెండింగులో ఉంచకుండా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. దీంతో పాటు ఇళ్లస్థలాల పట్టాల పంపిణీలో అర్హులను గుర్తించి నిజమైన లబ్ధిదారులకు దక్కేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అపూర్వచౌహాన్, చీర్లశ్రీనివాసులు, ఆర్డీఓ చంద్రకళ, కలెక్టరేట్ సూపరిండెంట్లు నరేష్, అన్ని మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణ వేగవంతం

జిల్లాలో నూతన ఓటరు నమోదు ప్రక్రియ ఓటరు జాబితా సవరణ వేగవంతంగా చేపడుతున్నట్లు కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. సోమవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజు నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో ఆమె పాల్గొని మాట్లాడారు.

'ప్రజావాణి'కి 87 ఫిర్యాదులు

వివిధ సమస్యలపై జిల్లా వ్యాప్తంగా ప్రజల నుంచి 87 ఫిర్యాదులు వచ్చినట్లు అడిషనల్ కలెక్టర్ చీర్ల శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ఫిర్యాదుదినోత్సవంలో భాగంగా ఐడీవోసీ కార్యాలయంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వచ్చిన ఫిర్యాదులలో 75 భూసంబంధమైనవి కాగా మిగిలినవి ఆసరా పింఛన్లు, ఇతర సమస్యలపై వచ్చినట్లు తెలిపారు. వీటిని సంబంధించి శాఖల అధికారులకు పంపినట్లు ప్ర తిఫిర్యాదుకు పరిష్కారం చూపాలని లేనిపక్షంలో అందుకు గల కారణం పేర్కొంటూ సంబంధిత ఫిర్యాదుదారునికి అక్నాలెడ్జ్ రూపంలో పంపాలన్నారు. సమావేశంలో ఎస్డీసీ సుబ్రమణ్యం వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

భూమికి భూమి ఇవ్వాల్సిందే..

- మల్లమ్మకుంట రిజర్వాయర్ సర్వే పనులు అడ్డుకున్న తనగల రైతులు
- అధికారులతో వాగ్వాదం.. సర్వే చేయకుండానే వెనుదిరిగిన వైనం



సర్వే అధికారులతో వాగ్వాదానికి దిగిన తనగల రైతులు

శాంతినగర్: రిజర్వాయర్ నిర్మాణానికి రైతుల నుంచి ఎంత భూమి (పొలం) తీసుకుంటే అంత భూమి మరో చోట కేటాయించాలని లేని పక్షంలో రిజర్వాయర్ నిర్మాణ పనులను అడ్డుకుంటామని తనగల రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మల్లమ్మకుంట రిజర్వాయర్ నిర్మించడానికి అవసరమైన భూములను పరిశీలించేందుకు ఆర్డీఎస్, నీటి పారుదలశాఖ, సర్వే అధికారులు సోమవారం మల్లమ్మ కుంటకు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న రైతులు తమ భూములు పోతే మేమేమి చేసి బతకాలని, కుటుంబాలు ఎలా పోషించుకునేదని అధికారులను ప్రశ్నించారు. అయితే, ప్రభుత్వం నుంచి భూమి సేకరించాలని మాకు ఆదేశాలు వున్నాయని, మా పని మమ్మల్ని చేసుకుపోనీయండి అని అధికారులు రైతులను కోరారు. ఎన్ని ఎకరాలు సేకరిస్తే అన్ని ఎకరాల భూమిని రైతులకు ఇస్తామని హామీ ఇవ్వాలని, లేని పక్షంలో సర్వే చేయించేదిలేదని అధికారులతో వాగ్వాదానికి దిగారు. మరికొందరు ఎకరానికి ఎంత పరిహారం ఇస్తారో చెప్పకుండా ఎలా భూములు అప్పగించేదని అధికారులను ప్రశ్నించారు. సర్వే చేయడానికి తాము వచ్చామని, అదంతా రెవెన్యూశాఖ ఉన్నతాధికారులు వచ్చి సమావేశం ఏర్పాటుచేసి చెబుతారని వివరించారు. ఇందుకు రైతులు ససేమిరా అంటూ సర్వే పనులను అడ్డుకున్నారు. చేసేదిలేక అధికారులు వెనుదిరిగారు.

ఆదిలోనే హంసపాదు..

మల్లమ్మకుంట రిజర్వాయర్ నిర్మాణ పనులకు మొదటి అడుగుపడిన తొలి రోజే రైతులు అడ్డుకున్నారు. రిజర్వాయర్ నిర్మిస్తే ఆర్డీఎస్ రైతులకు నీటి సమస్య వుండదని ఆయకట్టు రైతులు ఆశపడుతున్న తరుణంలో భూములు కోల్పోతున్న రైతులు అడ్డుకోవడంతో నిర్మాణ పనులకు ఆటంకం కలిగే సూచనలు అగుపిస్తున్నాయి.

567 ఎకరాల భూ సేకరణ

తుమ్మిళ్ల లిఫ్ట్ పథకంలో భాగంగా మల్లమ్మకుంట రిజర్వాయర్ నిర్మాణం చేపట్టడానికి 567 ఎకరాల భూమి అవసరం అవుతుందని గతంలో అధికారులు ప్రతిపాదనలు పంపారు. 1.02 టీఎంసీలు నీరు నిల్వ వుండాలంటే ఎన్ని భూములు మునుగుతాయో పరిశీలించడానికి సోమవారం అధికారులు తనగల సమీపంలోని మల్లమ్మకుంటకు చేరుకున్నారు. అధికారులు వచ్చారనే సమాచారంతో మల్లమ్మకుంట వద్దకు చేరుకున్న రైతులు అధికారులను నిలదీశారు. మల్లమ్మ కుంట నిర్మాణం వల్ల ఎగువన భూములు కోల్పోయే రైతులకు ఎలాంటి ఉపయోగం వుండదని, అలాంటప్పుడు మేము భూములు ఎలా ఇస్తామని అధికారులతో వాపోయారు. రిజర్వాయర్ పైభాగంలో అందరూ చిన్న సన్నకారు రైతులు వున్నారని, ఒక్కొక్కరికి ఎకరం నుంచి రెండు, మూడెకరాలు వుందని, వున్న భూమి రిజర్వాయర్‌లో పోతే తమకు ఆదెరువు ఏదని ప్రశ్నించారు. భూములు పరిశీలించి రెవెన్యూ అధికారులకు ప్రతిపాదనలు పంపుతామని, ఉన్నతాధికారులతో సమస్య విన్నవించుకోవాలని రైతులకు అధికారులు సూచించారు. భూసేకరణ విభాగం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆశన్న, ఏఈలు బాలాజి, రాజు, సర్వేయర్ రాములు వున్నారు.

అభివృద్ధి పథంలో పీయూ

యూనివర్సిటీలో రూ.9.50 కోట్లతో సింథటిక్ ట్రాక్ నిర్మాణానికి అనుమతులు

- అడ్మిన్ భవనానికి సోలార్ ప్యానల్స్ బిగింపు
- విద్యార్థులకు వసతుల కల్పనలో క్యాంటీన్, వాటర్ ట్యాంక్‌లు
- రూ.10 కోట్లతో రీసెర్చ్ ఫెసిలిటీ భవనం పనులు ప్రారంభం
- నవంబర్‌లో సందర్శించనున్న న్యాక్ బృందం



అడ్మిన్ భవనంపై బిగించిన సోలార్ ప్యానల్స్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ అన్ని వసతులు సమకూర్చుకుంటూ దినదినాభివృద్ధి చెందుతోంది. ప్రధానంగా విద్యార్థులకు వసతుల కల్పనలో కొత్త పుంతలు తొక్కుతోంది. పీయూలో విద్యార్థులు ఆడుకునేందుకు ప్రారంభం నుంచి శాశ్వత గ్రౌండ్ లేదు. దీంతో ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఎగ్జిక్యూటీవ్ కమిటీ సమావేశంలో సింథటిక్ ట్రాక్‌తో కూడిన గ్రౌండ్ నిర్మాణం కోసం చర్చించగా.. తాజాగా ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయి. 2.2 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న గ్రౌండ్‌తో పీయూ పరిధిలోని కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు క్రీడల పరంగా మరింత ప్రోత్సాహం ఇచ్చినట్లు అవుతుందని అధికారులు పేర్కొంటున్నారు. శనివారం ఉదయం పీయూ అడ్మినిస్ట్రేషన్ భవనంపై సోలార్ ప్యానెల్స్ బిగింపు పనులు ప్రారంభమయ్యాయి. అడ్మిన్ భవనంలో విద్యుత్ సదుపాయం సోలార్ ప్యానెల్స్ ద్వారానే పొందనున్నారు. అలాగే రూ.10కోట్లతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీసెర్చ్ ఫెసిలిటీ భవనం పనులు ప్రారంభమయ్యాయి. పీయూలో నీటి పునర్వినియోగం కోసం సీవేజ్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయనుండగా.. ఇది టెండర్ దశలో ఉంది.

న్యాక్ సందర్శన నేపథ్యంలో..

2019లో మొదటిసారి న్యాక్ (నేషనల్ అక్రిడేషన్ అసిస్మెంట్ కౌన్సిల్)కు వెళ్లారు. అప్పుడు మొదటి ప్రయత్నంలోనే పీయూకు బీ గ్రేడింగ్ వచ్చింది. దీంతో రూసా నుంచి రూ.5 కోట్లకు పైగా నిధులు అందాయి. ప్రతి ఐదేళ్లకోసారి న్యాక్ గుర్తింపు కోసం వెళ్లాలి. ఈ నవంబర్‌లో కూడా న్యాక్ బృందం పీయూను తనిఖీ చేయనుంది. ఇందుకు సంబంధించిన దరఖాస్తు ప్రక్రియను అధికారులు పూర్తిచేశారు. తనిఖీల నేపథ్యంలో పూర్తిస్థాయిలో వసతుల కల్పనపై దృష్టిపెట్టారు. ఈసారి మరింత మెరుగైన గ్రేడింగ్ సాధించేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. గ్రేడింగ్ పెరిగితే నిధులు సైతం సమకూరే అవకాశం ఉంది. వసతుల ఆధారంగా గ్రేడింగ్ ఇవ్వడంటంతో వాటి కల్పనపై పీయూ అధికారులు దృష్టికేంద్రీకరించారు.



పీయూలో నిర్మించిన బాస్కెట్‌బాల్ కోర్ట్

వసతుల కల్పనతో..

పీయూలో వసతుల కల్పనపై అధికారులు పూర్తి స్థాయిలో దృష్టిసారించారు. ఇప్పటికే బాస్కెట్‌బాల్, షటిల్ కోర్ట్‌లను రూ.20 లక్షలతో నిర్మించారు. దీంతోపాటు విద్యార్థులను దీర్ఘ కాలంగా వేధిస్తున్న నీటి కొరత తీర్చేందుకు పెద్ద ట్యాంక్ రూ.3.2 కోట్లతో నిర్మిస్తుండగా దాదాపు 70 శాతం పూర్తయ్యాయి. పీయూలో విద్యార్థినుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో రూ.10 కోట్లతో కొత్త భవనాన్ని నిర్మిస్తున్నారు. అలాగే విద్యార్థుల సౌకర్యం కోసం పీయూలో కొత్త క్యాంటీన్‌ను రూ.70 లక్షలతో నిర్మించనున్నారు. పీయూలో సైన్స్ డిపార్ట్‌మెంట్‌లో రీసెర్చ్‌ని మెరుగుపరిచేందుకు ఫెసిలిటీ భవనం నిర్మించే ప్రతిపాదనలు ఉన్నాయి. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే దాదాపు రూ.10 కోట్లతో నిర్మించేందుకు కసరత్తు చేస్తున్నారు. పీయూ అనుబంధ పీజీ సెంటర్లు గద్వాల, కొల్లాపూర్, వనపర్తిలో సైతం నూతన తరగతి గదులు, హాస్టళ్ల నిర్మాణాలు పూర్తికాగా.. కొన్నిచోట్ల జరుగుతున్నాయి.

సమగ్ర అభివృద్ధే లక్ష్యం..



పాలమూరు యూనివర్సిటీ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. ఇప్పటికే మంజూరైన నిధులతో వివిధ రకాల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. అలాగే వచ్చే నవంబర్‌లో న్యాక్ బృందం పీయూను సందర్శించనుంది. దీనిని దృష్టిలో పెట్టుకొని గతం కంటే మెరుగైన గ్రేడ్ సాధించేందుకు కృషిచేస్తున్నాం.

– లక్ష్మీకాంత్ రాథోడ్, వైస్ చాన్స్‌లర్, పీయూ

రూ.9.50 కోట్లతో..

పీయూలో జాతీయ స్థాయిలో క్రీడల నిర్వహణకు అ వసరమయ్యే సింథటిక్ ట్రాక్ నిర్మాణానికి అనుమతులు రావడంతో అధికారులు పనులు ప్రారంభించారు. వీసీగా లక్ష్మీకాంత్ రాథోడ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత కేంద్ర ప్రభుత్వ పథకం ఖేలో ఇండియాలో భాగంగా సింథటిక్ ట్రాక్ నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపించారు. దీంతో అధికారులు ఇప్పటికే గ్రౌండ్‌ను పరిశీలించగా.. అనుమతులు రావడానికి ఆలస్యమవుతున్నట్లు తెలుస్తుంది. అయి తే యూనివర్సిటీ, ప్రభుత్వ నిధులతో పూర్తిస్థాయి లో నిర్మించనున్నారు. గ్రౌండ్‌లో లెవలింగ్ పూర్తవగా.. సాంకేతిక పనులు చేపట్టాల్సి ఉంది. ఈ నిర్మాణంతో పీయూ పరిధిలో జాతీయ, రాష్ట్రస్థాయి క్రీడలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ఎంతో మేలు జరగనుంది. పీయూ పరిధిలో పలువురు క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. ట్రాక్ నిర్మిస్తే వీరు ఇక్కడే శిక్షణ పొందవచ్చు. ట్రాక్ ద్వారా యూనివర్సిటీకి ఆదాయం సైతం సమకూరే అవకాశం ఉంది.

ప్రజల మనోభావాలు దెబ్బతినేలా వ్యాఖ్యలు సరికాదు

గద్వాల: సనాతన ధర్మాన్ని నిర్మూలించాలంటూ డీఎంకే నేత, తమిళనాడు రాష్ట్ర మంత్రి ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు సరికాదని, ప్రతిఒక్కరూ దీనిని ఖండించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి డీకే స్నిగ్ధారెడ్డి పిలుపునిచ్చారు. ప్రజల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడిన ఆయనకు వ్యతిరేకంగా సోమవారం బీజేపీ నాయకులు ఆందోళన చేపట్టారు. పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించి, కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. డీఎంకే నేతలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉదయనిధితో పాటు ఆయన వ్యాఖ్యలను సమర్థిస్తున్న వారిపైన కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తక్షణమే ఉదయనిధి స్టాలిన్ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సనాతన ధర్మంపై ఇండియా కూటమి నేతల వైఖరి తెలపాలని, లేనిపక్షంలో దేశం వారిని క్షమించదని పేర్కొన్నారు. అనంతరం కలెక్టరేట్ అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బండల వెంకట్రాములు, త్యాగరాజు, నరేందర్‌రెడ్డి, శ్రీరాములు, బాస్కర్ యాదవ్, నర్సింహులు, యల్లప్ప, నల్లారెడ్డి, కిరణ్, ఆనంద్, అనిల్, సత్యం, శ్యామ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మెడికల్ కళాశాలకు భౌతికకాయం అప్పగింత


మరియమ్మ (ఫైల్)

ఎర్రవల్లిచౌరస్తా/పెబ్బేరు రూరల్: ఇటిక్యాల మండలంలోని యాక్తాపురం చెందిన మాజీ సర్పంచ్ మరియమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న వివిధ పార్టీల నాయకులు సోమవారం గ్రామానికి చేరుకుని ఆమె భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతురాలి కుమారుడు మాజీ జడ్పీటీసీ సుందర్‌రాజు తన మాతృమూర్తి అవశేషాలు చిరకాలం అందరికి కనపడేలా కళాశాలలో ఉండాలని వనపర్తి మెడికల్ కళాశాలకు భౌతికకాయాన్ని అప్పగించారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ సునందిని, అనాటమి హెచ్‌ఓడీ రోహిణి, అనాటమి అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎవిలింన్ జేమ్స్, వైద్య కళాశాల విద్యార్థులు, సిబ్బంది పార్థీవదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించి, ఘనంగా స్వాగతం పలికారు. అవయవదానం చేసిన వారి కుటుంబాన్ని గ్రామస్తులతో పాటు పలువురు అభినందించారు.


వైద్య కళాశాలలో పార్థీవదేహానికి నివాళి అర్పిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

బైక్‌ను ఢీట్టిన కారు: యువకుడి దుర్మరణం


భాస్కర్ నాయుడు (ఫైల్)

కొత్తకోట రూరల్: యూటర్న్ తీసుకునే క్రమంలో ఓ బైక్‌ను కారు ఢీకొట్టిన ఘటనలో బైక్‌పై వెళ్తున్న యువకుడు అక్కడికక్కడే మృతిచెందిన ఘటన ఆదివారం రాత్రి వనపర్తి జిల్లా కొత్తకోట ఎన్‌హెచ్44 పై చోటు చేసుకుంది. ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తకోట మండలం ముమ్మళ్లపల్లికి చెందిన భాస్కర్ నాయుడు(32) కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీలో ఉద్యోగం చేస్తుండేవాడు. ఆదివారం రాత్రి ముమ్మళ్లపల్లి నుంచి కొత్తకోటకు బైక్‌పై వెళ్తుండగా.. కొత్తకోట సమీపంలో మదర్‌థెరిస్సా జంక్షన్ వద్ద యూటర్న్ తీసుకుంటున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి పెబ్బేరు వైపు వెళ్తున్న కారు బైక్‌ను బలంగా ఢీకొట్టగా.. బైక్ పల్టీలు కొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న భాస్కర్‌నాయుడుకి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి నాగేషయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలియజేశారు.

నీటిగుంతలో పడి వృద్ధురాలి మృతి

మిడ్జిల్: నీటి గుంతలో పడి వృద్ధురాలు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండల కేంద్రానికి చెందిన కొత్తకుర్వ వల్లెమ్మ(70) మతి స్థిమితం సరిగా లేకపోవడంతో ఆదివారం ఉదయం 11గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లింది. సాయంత్రం వరకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు గ్రామంలో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. సోమవారం మధ్యాహ్నం నీటి గుంతలో మహిళ మృతదేహం చూసిన స్థానికులు వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు పరిశీలించగా, మృతదేహాన్ని బయటకు తీసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

చెరువులో పడి బాలుడు..


సాయి కుమార్ గౌడ్ (ఫైల్)

అయిజ: ప్రమాదవశాత్తు బాలుడు చెరువులో పడి మృతిచెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. చిన్నతాండ్రపాడుకు చెందిన సాయికుమార్ గౌడ్(16) సోమవారం చెరువులో పడి ప్రమాదవశాత్తు మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సీటీపాడుకు చెందిన వీరేష్ గౌడ్‌కు టాటా ఏసీ వాహనం ఉంది. ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం వీరేష్‌గౌడ్ కుమారుడు సాయి కుమార్ గౌడ్ ఆటోను కడుక్కొని వస్తానని ఇంట్లో చెప్పి గ్రామ సమీపంలోని లింగమ్మ చెరువు వద్దకు తీసుకెళ్లాడు. వాహనాన్ని నీటితో శుభ్రం చేస్తుండగా.. ప్రమాదవశాత్తు చెరువులో జారి పడ్డాడు. ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయి మృతిచెందాడు. ఆటోతో వెళ్లిన బాలుడు రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో అనుమానం వచ్చిన తండ్రి వీరేష్ గ్రామస్తులతో కలిసి చెరువు వద్దకు వెళ్లాడు. నీటిలో సాయికుమార్ గౌడ్ మృతదేహం కనిపించడంతో బోరున విలపించారు.

ఆలయంలో చోరీ

నారాయణపేట రూరల్: మండలంలోని కోటకొండ కాళికామాత దేవాలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. గుడిలోని అమ్మవారి విగ్రహానికి అలంకరించిన కండ్లు, కిరీటం, ఇతర వస్తువులు గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఉదయం పూజలు చేసేందుకు వెళ్లిన భక్తులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. రాత పూర్వకంగా ఫిర్యాదు రాకపోవడంతో కేసు నమోదు చేయలేదని ఎస్‌ఐ జయప్రసాద్ తెలిపారు.

సుజల దృశ్యాన్ని చూడబోతున్నాం


సభా స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి
- బహిరంగసభాస్థలిలో మార్పు

కొల్లాపూర్: పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్ ప్రారంభంతో ప్రపంచం మొత్తం సుజల దృశ్యాన్ని చూడబోతోందని.. సీఎం కేసీఆర్ మానస పుత్రిక, రాష్ట్ర ప్రభుత్వం సొంత నిధులతో నిర్మించిన ప్రాజెక్ట్ అని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. ఈ నెల 16న ముఖ్యమంత్రి కేసీఆర్ పాలమూరు ప్రాజెక్ట్ ప్రారంభించిన అనంతరం కొల్లాపూర్‌లో నిర్వహించే బహిరంగసభలో పాల్గొన నున్నారు. మొదట ఈదమ్మ ఆలయం సమీపంలో బహిరంగసభను నిర్వహించాలని నిర్ణయించినా.. బొంగరాల మిట్ట ప్రాంతం అనువుగా ఉందని అక్కడికి మార్చుతున్నట్లు నిరంజన్‌రెడ్డి వెల్లడించారు. సోమవారం ఆయన రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు, ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డితో కలిసి బొంగరాలమిట్ట ప్రాంతాన్ని పరిశీలించారు. సభావేదిక, వీఐపీ ప్రాంగణం, కళాకారుల వేదిక, జనం ఉండే ప్రాంతాలు, పార్కింగ్ ఏరియాల ఏర్పాటు అంశాలపై కలెక్టర్ ఉదయ్‌కుమార్, డీఐజీ షానవాజ్ ఖాసీంతో చర్చించారు. అనంతరం నిరంజన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. ప్రాజెక్టుపై అవగాహన లేని కొందరు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని.. పలు రకాల కోర్టు కేసుల కారణంగా కాల్వల తవ్వకాల్లో ఇబ్బందులు ఎదురయ్యాయన్నారు. కాల్వలు కూడా తవ్వుతామని.. ప్రాజెక్టు పనులు పూర్తి చేయడానికి కొంత సమయం పడుతుందని వివరించారు. సముద్ర మట్టానికి 300 అడుగుల ఎత్తులో ఉన్న నీటిని 687 అడుగులకు ఎత్తిపోసే ప్రాజెక్ట్ ప్రపంచంలో ఎక్కడా లేదన్నారు. పాలమూరు ప్రాజెక్ట్ ప్రారంభమైతే ఈ ఘనత మనకే దక్కుతుందని తెలిపారు. దక్షిణ తెలంగాణాను సస్యశ్యామలం చేసేందుకు ఇది దోహదపడుతుందన్నారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. మరో కోనసీమగా పాలమూరు జిల్లా మారబోతుందని తెలిపారు. ప్రపంచంలోనే అత్యంత భారీ మోటార్లతో పాలమూరు ప్రాజెక్ట్ నిర్మాణం జరిగిందని వివరించారు. జిల్లా ప్రజల గోస, వారు పడ్డ కష్టాలు ప్రాజెక్ట్ ప్రారంభంతో సమాప్తం కాబోతుందన్నారు. పాలమూరు జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నారని చెప్పారు. మంత్రుల వెంట ఉమ్మడి జిల్లా ఎస్పీలు, డీఎస్పీలు, రెవెన్యూ అధికారులు, స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

తప్పుడు కేసులకు భయపడేది లేదు

- నియంతలా వ్యవహరిస్తున్న ఎమ్మెల్యే గువ్వల
- మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు


మాట్లాడుతున్న మాజీ మంత్రి కృష్ణారావు

లింగాల: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు నియంతలా వ్యవహరిస్తున్నారని.. కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయించి ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు హెచ్చరించారు. యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రాథోడ్, మరో అయిదుగురిపై రౌడీషీట్ నమోదు చేయడాన్ని నిరసిస్తూ సోమవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించి దాదాపు మూడు గంటల పాటు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ధర్నాలు, ఆందోళనలు చేయడం తప్పా అని ప్రశ్నించారు. మండలంలో యువజన కాంగ్రెస్ బలంగా ఉండటం చూసి సహించని ఎమ్మెల్యే పోలీసులతో బలవంతంగా తప్పుడు కేసులు నమోదు చేయించి భయభ్రాంతులకు గురి చేయాలని చూస్తున్నారన్నారు. ముందుగా ఎమ్మెల్యేపై రౌడీషీట్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఐ శ్రీనివాస్ బీఆర్‌ఎస్ పార్టీ ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. బీఆర్‌ఎస్ పార్టీకి ముఖ్యంగా గువ్వల బాలరాజుకు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ప్రజలు నిర్ణయించుకున్నారని.. పోలీసు బలంతో ఎన్నికల్లో విజయం సాధించాలని పగటి కలలు కంటున్నారని తెలిపారు. యువజన కాంగ్రెస్ నాయకులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని, ఎస్‌ఐని సస్పెండ్ చేయాలని పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. అంతకుముందు అంబేడ్కర్ చౌరస్తా నుంచి పోలీస్‌స్టేషన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి, ఎంపీపీ లింగమ్మ, నియోజకవర్గంలోని అన్ని మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భారీగా మోహరించిన పోలీసులు..

కాంగ్రెస్ నేతల పోలీస్‌స్టేషన్ ముట్టడి దృష్ట్యా నియోజకవర్గంలోని వివిధ మండలాల ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది స్టేషన్ ఎదుట మోహరించాయి.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


బాలకిష్టయ్య(ఫైల్)

అడ్డాకుల: మూసాపేట మండలం పోల్కంపల్లికి చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మూసాపేట ఎస్‌ఐ కె.శ్రీనివాసులు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బోయ బాలకిష్టయ్య(50), అంజమ్మలు భార్యాభర్తలు. కొన్నాళ్ల నుంచి బాలకిష్టయ్య కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఈ నెల 9న పొలం వద్దకు వెళ్లగా అక్కడ కడుపు నొప్పి రావడంతో జీవితంపై విరక్తి చెంది పురుగు మందు తాగాడు. తర్వాత భార్య అంజమ్మకు ఫోన్ చేసి తాను పురుగు మందు తాగినట్లు చెప్పాడు. దీంతో వెంటనే కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి బాలకిష్టయ్యను చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సలహా మేరకు బాధితుడిని హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతునికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య అంజమ్మ సోమవారం మూసాపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

బొలెరో వాహనం ఢీకొని యువకుడి మృతి

- మరొక యువకుడి పరిస్థితి విషమం


సంఘటన స్థలం వద్ద వైద్యులతో మాట్లాడుతున్న బండ్ల జ్యోతి

ధరూరు: ఎదురెదురుగా వస్తున్న బొలెరో, ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరు మృతిచెందగా.. మరొకరు గాయాలపాలైన సంఘటన మండల కేంద్రానికి సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గట్టు మండల కేంద్రానికి చెందిన సాగర్, సుదీప్ తమ ద్విచక్రవాహనంపై గద్వాలకు బయలుదేరారు. మార్గమధ్యలో ధరూరు – పారుచర్ల స్టేజీల మధ్య గద్వాల వైపు నుంచి వస్తున్న బొలెరో వాహనం, ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో సాగర్(19) అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్ర గాయాలపాలైన సుదీప్‌ను గద్వాల ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. సంఘటన జరిగిన సమయంలో అటుగా వెళ్తున్న ఎమ్మెల్యే సతీమణి, బూరెడ్డిపల్లి సర్పంచ్ బండ్ల జ్యోతి క్షతగాత్రులను ఏరియా ఆస్పత్రికి తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గద్వాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి శాంతయ్య రాత్రి 8 గంటల సమయంలో ఆస్పత్రికి చేరుకుని విలపించాడు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివానందం గౌడ్ తెలిపారు. బొలెరో ఓనర్(సీతారామయ్య) తన వాహనాన్ని సోలార్ కంపెనీలో అద్దెకు ఉంచినట్లు తెలిసింది.

హారన్ కొట్టాడని.. ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి

హారన్ కొట్టాడని గద్వాల డిపోకు చెందిన ఆర్టీసీ ప్రైవేటు అద్దె బస్సు డ్రైవర్‌పై ఓ యువకుడు దాడి చేసిన సంఘటన పారుచర్ల స్టేజీ సమీపంలో చోటు చేసుకుంది. సోమవారం గద్వాల వైపు వెళ్తున్న రాయిచూరు బస్సు డ్రైవర్ ముందుగా వెళ్తున్న వాహన ట్రాఫిక్‌ను క్లియర్ చేసుకునేందుకు హారన్ కొట్టాడు. పదే పదే హారన్ ఎందుకు కొట్టావని బస్సును ఆపి డ్రైవర్‌పై దాడి చేసిన ఓ వీడియో వైరల్ అవుతోంది. మీ అధిక స్పీడుతోనే ప్రమాదాలు జరుగుతున్నాయంటూ దాడి చేశాడు. డ్రైవర్ ఎవరు..? కొట్టిన వ్యక్తి ఎవరనేది తెలియరాలేదు.

రెండు టిప్పర్లు ఢీ : తప్పిన పెనుప్రమాదం



కొత్తకోట రూరల్: ముందు వెళ్తున్న టిప్పర్‌ను వెనుక నుంచి మరో టిప్పర్ ఢీకొట్టిన ఘటన కొత్తకోట మండలం కానాయపల్లి స్టేజీ సమీపంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం రాయిచూర్ నుంచి సిమెంట్ పెళ్లలను తయారు చేసే డస్ట్‌ను రెండు టిప్పర్లు తీసుకెళ్తున్నాయి. కొత్తకోట మండలం కానాయపల్లి స్టేజీ సమీపంలోకి రాగానే ముందు వెళ్తున్న టిప్పర్‌ను వెనుక నుంచి మరో టిప్పర్ ఢీకొట్టింది. దీంతో వెనుక టిప్పర్ ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. ప్రమాద స్థలంలో టిప్పర్లు రోడ్డుకు అడ్డంగా పడిపోయాయి. ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలుగకుండా క్రేన్ సాయంతో టిప్పర్లను పక్కకు తొలగించామని ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలియజేశారు. ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని, ఫిర్యాదు అందితే కేసు నమోదు చేస్తామన్నారు.

ట్రాక్టర్లు సీజ్

జడ్చర్ల: నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి ధ్రువపత్రాలు లేని ట్రాక్టర్లను తెలంగాణ నుంచి గుజరాత్‌కు తరలిస్తుండగా పట్టుకున్న పోలీసులు రోడ్డు రవాణాశాఖ అధికారులకు అప్పగించడంతో సీజ్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఈ నెల 7న శంకరాయపల్లి తండా గేటు వద్ద జాతీయ రహదారిపై ట్రాక్టర్లను తరలిస్తున్న రెండు గూడ్స్ లారీలను పోలీసులు పట్టుకున్నారు. వీటిని మహబూబ్‌నగర్ నుంచి గుజరాత్‌కు తరలిస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఆ ట్రాక్టర్లకు ఎలాంటి ధ్రువపత్రాలు లేకపోవడంతో జిల్లా రవాణాశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు సోమవారం ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు.

స్వల్పంగా పెరిగిన ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో స్వల్పంగా పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆదివారం సాయంత్రం 7గంటల వరకు ప్రాజెక్టుకు ఎగువ నుంచి 10వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, సోమవారం సాయంత్రానికి ప్రాజెక్టుకు వస్తున్న ఇన్‌ఫ్లో 15వేల క్యూసెక్కులకు తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగమైన గుడ్డెందొడ్డి లిఫ్టు–1 వద్ద ఒక పంపు ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750, ఆవిరి రూపంలో 93, ఎడమ కాల్వకు 920, కుడి కాల్వకు 652, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 60 క్యూసెక్కులు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 9.173 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఎగువన ఉన్న అల్మట్టి ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 129.72 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 114.083 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు నుంచి 11,285 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 37.64 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 25.77 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 9,801క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, ఎలాంటి అవుట్ ఫ్లో లేదని అధికారులు తెలిపారు.

రెండు యూనిట్లలలో విద్యుదుత్పత్తి..

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు దిగువ, ఎగువ జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో స్వల్పంగా ఉత్పత్తి కొనసాగుతుంది. సోమవారం 2 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈ రామసుబ్బారెడ్డి, డీఈ పవన్‌కుమార్ తెలిపారు. ఎగువ కర్నాటక రాష్ట్రంలోని ఆల్మట్టి, నారాయణపూర్ డ్యాంల నుంచి వరద స్వల్పంగా చేరుతుండడంతో ఎగువలో ఒక యూనిట్ ద్వారా 39 మెగావాట్లు, 81.683 ఎం.యూ. దిగువలో ఒక యూనిట్ ద్వారా 40 మెగావాట్లు, 87.956 ఎం.యూ. విద్యుదుత్పత్తిని చేపడుతున్నామన్నారు. ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటివరకు 169.839 మిలియన్ యూనిట్ల ఉత్పత్తిని సాధించామని తెలిపారు.

శ్రీశైలంలో 854.9 అడుగుల నీటిమట్టం

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో సోమవారం 854.9 అడుగుల వద్ద 91.6 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జూరాలలో విద్యుదుత్పత్తి చేస్తూ 5,522 క్యూసెక్కుల నీటిని శ్రీశైలంకు వదులుతున్నారు. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 1,750, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు 1,458, రేగుమాన్ గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 800 క్యూసెక్కుల నీటిని వదిలారు. జలాశయంలో 105 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

అటవీ సంరక్షణకు పాటుపడాలి


అచ్చంపేట అంబేడ్కర్‌చౌరస్తాలో ర్యాలీగా వస్తున్న అటవీశాఖ ఉద్యోగులు

- ఉద్యోగులు ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించాలి
- అటవీ అమరవీరుల సంస్మరణ సభలో డీఎఫ్ఓ రోహిత్‌రెడ్డి

అచ్చంపేట రూరల్: అటవీశాఖ ఉద్యోగులు, చెంచులతో, అటవీ సమీప గ్రామాల ప్రజలతో సత్సంబంధాలను కొనసాగించాలని డీఎఫ్ఓ రోహిత్‌రెడ్డి గోపిడి కోరారు. సోమవారం అచ్చంపేటలో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ అటవీశాఖ ఉద్యోగుల ఆధ్వర్యంలో జాతీయ అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రధాన రహదారి వెంట ఉద్యోగులు బైక్ ర్యాలీ నిర్వహించారు. అటవీశాఖ కార్యాలయం ఆవరణలో అమరవీరుల స్తూపం వద్ద నివాళి అర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో డీఎఫ్ఓ మాట్లాడారు. అటవీ సంరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. అంకితభావంతో పనిచేసినప్పుడే అమరుల ఆత్మకు శాంతి చేకూరుతుందన్నారు. యువ ఉద్యోగులు సీనియర్ల అనుభవాలను పాటించాలని, మంచి పనులు చేసినప్పుడే గుర్తింపు వస్తుందన్నారు. భవిష్యత్ తరాల కోసం మనం విధులు నిర్వర్తిస్తున్నామని, భారంగా కాకుండా బాధ్యతగా పని చేయాలన్నారు. అలాగే ప్రాణాలను రక్షించుకుంటూ విధులు నిర్వర్తించాల్సి ఉంటుందన్నారు. అటవీ జంతువులు మొదటగా హెచ్చరిస్తాయని, తర్వాతనే దాడులు చేస్తాయన్నారు. చెంచులతో నేర్చుకోవాల్సింది చాలా ఉందన్నారు. దట్టమైన అడవిలో సంచరించేటప్పుడు వారి సలహాలు, సూచనలు ఎంతో అవసరమన్నారు. పొరపాట్లు జరగకుండా చూసుకోవాలన్నారు. రాష్ట్రానికి జాతీయ స్థాయిలో అవార్డులు రానున్నాయని, సిబ్బంది కృషితోనే అది సాధ్యమైందన్నారు. ఉద్యోగుల సమస్యలను యూనియన్ పరంగా పరిష్కరించుకోవాలని, ఉన్నతాధికారుల పరిధిలోని సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అటవీ ఉద్యోగులు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అంతకు ముందు ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు అటవీశాఖ ఉద్యోగులతో కలిసి బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ ఉద్యోగులు శ్రీనివాస్, ఆదిత్య, రాజేందర్, పర్వేజ్, వీరేష్, ఈశ్వర్, ముజీబ్, భగ్న, నాగరాజు, రాంబాబు, మధుసూదన్‌గౌడ్, పద్మ, వెంకటేష్ పాల్గొన్నారు.

గట్టెక్కేందుకే వాగ్దానాలు

- ఒక్క ఇల్లు కట్టకుండా ఓట్లెలా అడుగుతారు?
- మాజీమంత్రి నాగం జనార్దన్‌రెడ్డి

సాక్షి, నాగర్‌కర్నూల్: వచ్చే ఎన్నికల్లో గట్టెక్కేందుకే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు గ్రామాల్లో శుష్క వాగ్దానాలు చేస్తున్నారని మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత నాగం జనార్దన్‌రెడ్డి విమర్శించారు. నియోజకవర్గాల్లో ఒక్క డబుల్ ఇల్లు నిర్మించి ఇవ్వకుండా ఎన్నికల్లో ఓట్లెలా అడుగుతారని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో జిల్లాకు ఆసుపత్రి, పీహెచ్‌సీ, సబ్‌స్టేషన్ ఒక్కటి కూడా అదనంగా రాలేదని చెప్పారు. జిల్లా ప్రగతిపై ఏనాడూ ఒక్క మంత్రి వచ్చి సమీక్షించిన దాఖలాలు లేవన్నారు. తమ హయాంలో నిర్మించిన భవనాలకు కొత్త శిలాఫలకాలు వేసుకొని మురిసిపోతున్నారని దుయ్యబట్టారు. జిల్లాకేంద్రంలో ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో నాలుగు సూట్లను మంజూరు చేస్తే, ప్రస్తుత ఎమ్మెల్యే అందులో బట్టల దుకాణం పెట్టే పనిలో ఉన్నాడని ఆరోపించారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలోని చెరువుల్లో నల్లమట్టి, తాడూరు కొమ్ము గుట్ట ఎక్కడికి పోయిందని ప్రశ్నించారు. తాను 25 ఏళ్లపాటు ఎమ్మెల్యేగా ఉన్నా ఏనాడూ వివక్ష చూపలేదని, అందరివాడిగా కొనసాగానని చెప్పారు. ప్రస్తుత ఎమ్మెల్యే కాళ్లు మొక్కితేనే పథకాలు అందే పరిస్థితి ఉందని విమర్శించారు. 6 నెలల్లోనే మార్కండేయ ప్రాజెక్టును పూర్తిచేస్తామని చెప్పి 7 నెలలు దాటినా ఇప్పటికీ కదలిక లేదని అన్నారు.

సపోర్ట్ చేస్తే.. ధోకా చేయను..

ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి ప్రస్తుతం ఏ పార్టీలో ఉన్నారని నాగం ప్రశ్నించారు. 2016లో తాను ఎమ్మెల్సీని చేయకపోతే ఆయన జన్మలో ఎమ్మెల్సీ అయ్యేవారు కాదని వ్యాఖ్యానించారు. కానీ ఆయనలా ఎప్పుడూ మోసం చేయలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో తనకు మద్దతుగా నిలిచిన వారికి తాను ఎప్పటికీ అండగా ఉంటానని, ధోకా చేయనని వ్యాఖ్యానించారు. తన మాటపై కట్టుబడి ఉంటున్నట్లు చెప్పారు. తాను ఎన్నికల్లో ఓడినా పార్టీని విడిచిపెట్టలేదని, ఎన్నికలు ఏవైనా పార్టీ కోసం పనిచేశానని అన్నారు.

ఆగిన లారీని ఢీకొట్టిన ట్రావెల్ బస్సు


ప్రమాదంలో ధ్వంసమైన బస్సు ముందు భాగం

ఎర్రవల్లిచౌరస్తా: జాతీయ రహదారిపై ఆగి ఉన్న కంటైనర్ లారీని వెనుక నుంచి ట్రావెల్ బస్సు ఢీకొట్టడంతో నలుగురికి గాయాలైన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ కృష్ణదేవా కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. తిరుపతి నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఓ ట్రావెల్ బస్సు ఇటిక్యాల మండల పరిధిలోని వేముల స్టేజీ సమీపంలోకి రాగానే టైర్ పంక్చర్ అయ్యింది. దీంతో రోడ్డుపై ఆగి ఉన్న కంటైనర్ లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో బస్సు ముందు భాగం, లారీ వెనుక భాగం పూర్తిగా ధ్వంసం కావడంతో నలుగురికి తీవ్ర గాయాలు కాగా.. మిగిలిన ప్రయాణికులు తేలికపాటి గాయాలతో బయటపడ్డారు. గమనించిన స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కర్నూల్‌కు తరలించారు. బస్సు డ్రైవర్ ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

నిజాయితీ చాటుకున్న ప్రయాణికురాలు


బాధితురాలికి ఆభరణాల పర్సును అందిస్తున్న ప్రయాణికురాలు, కండక్టర్

అచ్చంపేట రూరల్: ఆర్టీసీ బస్సులో దొరికిన బంగారు ఆభరణాల పర్సును బాధిత మహిళకు అందజేసి నిజాయితీ చాటుకుంది ఓ ప్రయాణికురాలు. వివరాల్లోకి వెళ్తే.. ఉప్పునుంతల మండలం కాంసానిపల్లికి చెందిన నెల్లోజు ప్రసన్న ఆదివారం ఓ శుభకార్యానికి వెళ్లి తిరిగి కల్వకుర్తి నుంచి ఉప్పునుంతల వరకు అచ్చంపేట ఆర్టీసీ డిపోకు చెందిన బస్సులో ఎక్కింది. ఉప్పునుంతలలో దిగి గ్రామానికి వెళ్లి హ్యాండ్‌బ్యాగ్‌లో చూడగా బంగారు ఆభరణాలు (సుమారు రూ.3 లక్షల విలువ)న్న పర్సు కనిపించలేదు. అదే బస్సులో ప్రయాణించిన సదగోడుకు చెందిన శోభకు బస్సులోనే ఆభరణాల పర్సు దొరకగా కండక్టర్ నారాయణమ్మకు అందజేసింది. సోమవారం అచ్చంపేట డిపో ఆవరణలో బాధితురాలు ప్రసన్నకు పర్సును అందజేసి నిజాయితీని చాటుకుంది.

అన్నను చంపిన తమ్ముడికి యావజ్జీవం

నారాయణపేట: దామరగిద్ద పోలీస్‌స్టేషన్ పరిధిలో అన్నను చంపిన తమ్ముడిపై యావజ్జీవ కారాగార జైలు శిక్షతో పాటు రూ.20వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫీ తీర్పునిచ్చారు. కేసు వివరాల్లోకి వెళితే..2021 ఏప్రిల్ 7న గుండు స్వామి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్‌ఐ గోవర్దన్ నిందితుడు బ్యాగరి బుగ్గప్పపై కేసు నమోదు చేశారు. దామరగిద్ద మండలం క్యాతన్‌పల్లికి చెందిన బ్యాగరి బుగ్గప్పకు తన అన్న హన్మంతుకు భూతగాదాలు ఉన్నాయి. ఈ విషయంలో గ్రామ పెద్దలు, కులస్తుల సమక్షంలో మాట్లాడిన బ్యాగరి బుగ్గప్ప రాజీకి వచ్చారు. అదే ఏడాది ఏప్రిల్ 6 బొంబాయి హన్మంతు అలియాస్ బ్యాగరి హన్మంతు (55) రాత్రి పొలం వద్ద వరి చేనుకు నీళ్లు పెట్టేందుకు వెళ్లాడు. గమనించిన బుగ్గప్ప వరి పొలం వద్ద వెళ్లి తన అన్నతో గొడవపడుతుండగా పక్క పొలంలో ఉన్న బ్యాగరి బాలప్ప గమనించి విడిపించేందుకు ప్రయత్నించాడు. అతనిని పక్కకు నెట్టి తన చేతిలో ఉన్న పదునైన ఆయుధంతో హన్మంతును పొడవగా స్పృహతప్పి పడిపోయినట్లు తెలిపారు. పరిస్థితి విషమించడంతో ఆయన మృతి చెందాడు. ఘటనపై అప్పటి సీఐ శ్రీకాంత్‌రెడ్డి నేర పరిశోధన చేసి నేరస్తునిపై కోర్టులో చార్జిషీట్ వేశారు. నేరము రుజువు కావడంతో జిల్లా జడ్జి నిందితుడికి శిక్ష ఖరారు చేశారు.

వ్యక్తి రిమాండ్‌కు..

పాన్‌గల్: వీపనగండ్ల మండలం తూంకుంటకు చెందిన శివ ఆదివారం బైక్‌పై 4 కిలోల గంజాయి తరలిస్తూ మండల కేంద్రంలో పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో పట్టుబడిన విషయం పాఠకులకు విదితమే. శివను సోమవారం వనపర్తి ఇన్‌చార్జ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి ఆదేశానుసారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ వేణు తెలిపారు.

నేచర్ గైడ్‌లకు ప్రత్యేక శిక్షణ


శిక్షణకు బయలుదేరిన అటవీశాఖ నేచర్‌గైడ్స్

మన్ననూర్: అమ్రాబాద్ పులుల రక్షిత అభయారణ్యంలో (అటవీశాఖ) నేచర్‌గైడ్లుగా విధులు నిర్వర్తిస్తున్న పది మంది చెంచు యువతను ప్రత్యేక శిక్షణ నిమిత్తం ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లాకు పంపినట్లు అటవీ అధికారులు తెలిపారు. వీరికి అక్కడ వారం పాటు శిక్షణ ఉంటుందని.. పర్యాటకులతో మాట్లాడటం, వారిని ఆకట్టుకునే విధానం తదితర అంశాలను శిక్షణలో వివరిస్తారన్నారు. పెద్దపులుల కలయిక రోజులు (సంపర్గం) వాటికి ఆటంకం కలుగకుండా ఉండేందుకు ప్రస్తుతం సఫారీ కొనసాగడం లేదని.. వచ్చే నెల మొదటి వారంలో పునః ప్రారంభిస్తామని తెలిపారు.